
**కథ**

## రూ. 3,000 ప్రత్యేక బహుమతి పొందిన కథ



# నాలుగో నాటకం

**- వి.ఆర్.రాసాని**

''శివరాత్రి ఇంక వారమే వుండేది! నాలుగు దినాలుగా తారాడతావుండా.
ఈ రోజు ఎట్టయినా సరే. ఎలుగ్గొడ్డోన్ని పట్టుకుని తీరాల. వాళ్ళ గేరికి పోయినా సరే వాణ్ణి బట్టాల'' అనుకుంటూ
అడవి మొగదలగా వున్న ఆ పల్లెలోకి అడుగుపెట్టాడు గురవయ్య.
వీధిలో ఒకచోట గణగణా గంటమోగుతోంది. డక్కీ శబ్దం వినిపిస్తోంది. జనం గుమికూడి వున్నారు.
మెల్లగా అక్కడికి వెళ్ళాడు గురవయ్య. అక్కడ ముడ్డిగంటోడు అడుగేస్తున్నాడు.

''రామరామ రామా రామా కోదండరామా
రామరామ రామా రామా జానకీరామా
ఆలిదమ్ములతో అడవికొచ్చినా అయోధ్యరామా
రక్కసి మూకల రయమున జంపిన రఘురామా
రామా'' అవిరామంగా అతని ఆటాపాటా సాగిపోతోంది.

ముడ్డికి కట్టి వున్న గంటను ఒక చేత్తో, మెడలో వేలాడుతున్న డక్కీని మరో చేత్తో వాయిస్తూ, ఆ శబ్దానికి అనుగుణంగా [illegible]గజ్జెల్ని కదిలిస్తూ చిందులేస్తున్నాడు.

దిట్టంగా,పొట్టిగా కండలు తిరిగిన నల్లటి శరీరం ముడ్డిగంటోడిది. బాగా మురికి పట్టివున్న గోచీ, ఓ చేతిరెట్టకు కడియం, మరో చేతి మణికట్టుకు చుట్టిన నల్లటి దారం తప్ప అతని ఒంటిపైన ఏ ఆచ్ఛాదనా లేదు. ఆ పక్కనే పెట్టివున్న జోలె తప్ప తనదంటూ ఏమీ కనిపించలేదు. నడివీధే రంగస్థలంగా సాగిపోతోంది ముడ్డిగంటోని నృత్యం. దాన్ని చూస్తున్న జనాలకదొక వింతగా అనిపిస్తోంది. అతన్ని చూడగానే దార్లో ఎవ్వరో చెప్పిన మాట గురువయ్య చెవుల్లో రింగుమంది.

''ముడ్డిగంటోడు, ఎలుగ్గొడ్డోని సావాసి కాపు. వీడెక్కడుంటే వాడక్కడుంటాడు. వాడెక్కడుంటే వీడూ అక్కడుంటాడు. నిన్ననే ఈ పల్లెకొచ్చి వాళ్ళ గేరికి పోవాలనుకుంటున్నారు. ఈ చుట్టపక్కల పల్లెల్లో ఎక్కడో వుంటారు చూడు''

''కడకు వీడు కనిపించినాడు. ఇంక ఎలగ్గొడ్డోన్ని పట్టుకోవాల. ఎలగ్గొడ్డు శరమ్ముసంపాదించాల. అది సంపాదిస్తే గానీ తంబళ్ళ పల్లికి పోను. ఆ మల్లన్న సామిని సూడను'' ఆలోచిస్తూనే వీధి వైపు చూశాడు గురువయ్య. ఉత్తరదక్షిణంగా వ్యాపించి వున్న ఆ వీధిలో ఎక్కడా ఎలగ్గొడ్డోని జాడలేదు. ''ఈ ముండాకొడుకు యాడ జచ్చినాడో ఏమో?'' అనుకుంటూ ముడ్డిగుంటోని నృత్యం చూస్తున్న వ్యక్తుల్లో ఒకతని దగ్గరికి వెళ్ళి''ఏమప్పా. ఈ ఊర్లోకి ఎలుగ్గొడోడొచ్చినాడా?'' అని అడిగాడు.

ఆ వ్యక్తి గురువయ్యను ఒక్కసారి ఎగిదిగా చూసి ''ఆ పక్క వీధిలోకి పోయినట్టుండాడు సూడు'' అని జవాబిచ్చి మళ్ళీ ముడ్డిగుంటోని నృత్యం చూడడంలో మునిగిపోయాడు. ఆ మాట వినగానే, నాలుగురోజుల తన అన్వేషణ ఫలించబోతున్నందుకు సంతోషం కలిగింది గురువయ్యకు. 'హమ్మయ్య' అనుకుంటూ రెండిండ్లకవతలున్న సందులోకి నడిచి. పక్కవీధిలోకిఅడుగుపెట్టాడు. అలా అడుగుపెట్టగానే అతని చెవులకు మధురమైన మురళీనాదం వినిపించింది.



''ఇది ఆ ఎలుగ్గొడ్డోడి పిల్లం గట్టి పాటే..మా పల్లెకొచ్చినప్పుడు ఎన్నిసార్లు విన్లే?'' అనుకుంటూ ఆ నాదం వినిపించినవైపుకు చూశాడు.

అక్కడ ఒక ఇంటిముందర పిల్లనగ్రోవి ఊదుతూ జనాన్ని ఆకర్షిస్తూ, ఎలుగ్గొడ్డును ఆడిస్తూ కనిపించాడు ఎలుగ్గొడ్డోడు. అతన్ని చూడగానే గురువయ్య ముఖం ఆనందంతో విప్పారింది.

''ఆయ్ జాంబా! ఉర్! బైటో! ఆట.. ఆడు.. ఫల్టీ.. ఫల్టీ'' అంటూ పిల్లనగ్రోవి ఊదడం ఆపి, అప్పుడప్పుడు ఎలుగ్గొడ్డును కూర్చోబెడుతూ, లేపుతూ, ఫల్టీలు కొట్టిస్తూ ఆడిస్తున్నాడు ఎలుగ్గొడ్డోడు.

శరీరమంతా దట్టమైన నల్లటి బొచ్చుతో, పొడవాటి కోరలతో, గోళ్ళతో అతను చెప్పినట్లు వింటున్న ఎలుగ్గొడ్డును, దాని మెడలో వున్న కంటెకు అనుసంధానం చేసి వున్న గొలుసుతో ఇంటింటి ముందుకు నడిపించుకుంటూ వెళ్ళి ఆడిస్తున్నాడు ఎలుగ్గొడ్డోడు.

యాభై దాటిన వయసు, పొడువాటి మీసాలు, కొప్పుచేసి ముడివేసి వున్న జుట్టు జారిపోకుండా కట్టిన తలపాగా. మెడలో పులిగోరు, పొడుగుచేతుల పాత చొక్కా, మోకాలి దాకా జార్చి బిగించిన పంచె, ఒక చేతి మణికట్టుకు, ఒక కాలికి చుట్టివున్న ఇనుప కడియం, సంకలో జోలె, ఎప్పుడూ తాంబులాం నమలడం వల్ల నల్లబడ్డ పళ్ళు, చెవిలో బీడీతుంటలో ప్రత్యేకంగా కనిపిస్తున్నాడు ఎలుగ్గొడ్డోడు.

ఇళ్ళ ముందరికొచ్చినప్పుడు అన్నంపెట్టేవాళ్ళు పెడుతుంటే,ధాన్యం ఇచ్చేవాళ్ళు ధాన్యమిస్తుంటే, అన్నీ ఆ జోలెలోనే చేరిపోతున్నాయి.

''అమ్మా, అయ్యా! ఓ పాతపంచె, చీరగుడ్డ, లాగు, డాయరు, సొక్కా గుడ్డ ఏదయినా సరే.. మీరు కట్టేసి, ఇడిసి పెట్టేసింది ఇయ్యండి. వాటితో నా పెండ్లాం బిడ్డలు వళ్ళు కప్పుకుంటారు'' అంటూ అడిగి మరీ తీసుకుంటున్నాడు. ఇచ్చిన వారు ఇస్తున్నారు. లేనివాళ్ళు లేదు.

కొందరాడవాళ్ళు.. అర్ధో, రూపాయో ఇచ్చి, బిడ్డలకి ఎలుగ్గొడ్డు వెంట్రుకల్ని కాల్చి దూపమేస్తే మంచిదనుకుని ఎలుగ్గొడ్డు వెంట్రుకల్ని అడిగి పీకించుకుని వెళుతున్నారు. గురువయ్య దూరం నుంచే అన్నీ చూస్తున్నాడు.

అన్ని ఇండ్లు తిరిగిన తర్వాత ఊరి ముందరున్న చింతచెట్టు కిందికి చేరుకున్నాడు ఎలుగ్గొడ్డోడు. అక్కడి నుంచీ ప్రారంభమయ్యే అడవికి నాయకత్వం వహిస్తున్నట్లు, ఆకాశంలో నిటారుగా నిలబడి గంభీరంగా కనిపిస్తోంది చింతచెట్టు. దాని కిందా, ఒకటి ఆరా పెరిగిన తుప్పచెట్లు, అక్కడక్కడా చిన్న చిన్న గుండ్లు వున్నాయి.

అక్కడ గుంటిపైన కూర్చుని కర్రతో ''బైటో.. బైటో''అంటూ ఎలుగ్గొడ్డును అదిలించి కూర్చోబెట్టాడు.. ఆ తర్వాత కడుపు ఉగ్గబట్టి, ముక్కి ''బైటికి కూసో'' అన్నాడు ఎలుగ్గొడ్డోడు.

అంతవరకూ మోరెత్తి అతనివైపే చూస్తున్న ఎలుగుబంటు అర్థమైనట్లు తల ఊపి అతను సూచించినట్టే కడుపు ఉగ్గబట్టి, ముందు మూత్రం పోసి, ఆ తర్వాత మలవిసర్జన చేసింది. దాని వాసన గాలిలో ఆ ప్రాంతమంతా వ్యాపించింది. ఎలుగ్గొడ్డోడు నింపాదిగా గాలి పీల్చుకుని, జేబులో నుంచి అగ్గిపెట్టె తీసి, మరో చేత్తో చెవిలో ఇరికించుకున్న తుంట బీడీని నోట్లో పెట్టుకుని, అగ్గిపుల్ల గీసి వెలిగించుకున్నాడు.

అదంతా గమనిస్తున్న గురువయ్య ''మాటలు రావుగానీ.. అంతా మనిషి మాదిరే'' మనుసులో అనుకుని, ''ఏమయ్యా! బాగుండావా?'' అంటూ పరిచయస్తుడిలా అతన్ని సమీపించాడు.

అతనొక్కసారి పరిశీలనగా చూసి ''నిన్నెప్పుడూ చూడనేలేదే. తెలిసినోడి మాదిరి పలకరిస్తివే. ఎవురన్నా నీవు?'' బీడీ పొగను వదులుతూ అడిగాడు ఎలుగ్గొడ్డోడు.

''నువ్వు వూరూరు తిరుగతా వుంటావు కాబట్టి నీకెవురూ గుర్తులేకపోవచ్చు. ఈ పక్క పల్లెల మీద ఎలుగ్గొడ్డుని తీసుకొచ్చి ఆడిపించేది నువ్వొక్కడివే గదా. నువ్వు అందరికీ తెలుసులే'' అతనికి ఎదురుగా వున్న మరో గుండు పైన కూర్చుంటూ గురువయ్య అన్నాడు.

''ఇంతకీ మీ ఊరేదో చెప్పనే లేదే?'' అడిగాడతను.

''మాది పెద్దతిప్ప సముద్రంకవతలుండ్లా, పాత కురప్పల్లె..అదీ!''

''కురబల కోటకివతలుండే పల్లె గదా''

''ఆ..అదే''

''అన్నుంచి ఇంత దూరం ఏం పనిమీదొచ్చి నావన్నా''

''మీ ఎలుగ్గొడ్డుని బాయికాడికే ఎలబారినా?''

''ఆడికెందుకన్నా?''

''నిజం చెప్పాలంటే, నీకోసమే వస్తిని. వస్తా వుంటే నువ్వు ఈ వూళ్ళో వున్నావని తెలిసే. అందుకని నిన్నే తారాడతా వస్తావుండా''

''దేశాలబట్టి తిరుగుతూ, ఆర్నెళ్ళకో సంవత్సరానికో ఒకసారి గేరికి వచ్చే నాలాంటాడికోసం వచ్చేవాళ్ళుండారా?'' అని ఒక్క క్షణం ఆశ్చర్యపోయి, ''ఎలుగ్గొడ్డుని ఆడిపించుకుని బతికే నాతో నీకే పనన్నా?'' అంటూ ప్రశ్నించాడు ఎలుగ్గొడ్డోడు.

''నాకు ఒక ఎలుగ్గొడ్డు శరమ్ము గావాలబ్బా'' తాను వచ్చిన పని చెప్పాడు గురువయ్య. ఆ మాట వినగానే ఒక్క క్షణం ఉలిక్కిపడ్డాడు ఎలుగ్గొడ్డోడు.

''అయ్యో! ఇప్పుడు కాలం మారిపోయిందన్నా. అడవిలో జీవాలను సంపకూడదంట. వాటి శర్మాలు అమ్మకూడదంట. అట్లా చేస్తే జైల్లో యేస్తారంట'' తన భయాన్ని వ్యక్తం చేశాడు ఎలుగ్గొడ్డోడు.

''గవర్నమెంటు అంటానే వుంటాది. సట్టాలు సేస్తానే వుంటాది. ఎవురు పాటిస్తావుండారు?''

''ఇంతకూ ఎలుగ్గొడ్డు శర్మము నీకెందుకన్నా. నువ్వేమన్నా మల్లేశు కుక్కవా?'' అనుమానంగా అడిగాడు.

''అవునబ్బా. నేను మల్లయ్యగారి కుక్కని''

''అట్ల చెప్పు. వాళ్ళకే గదా ఎలుగ్గొడ్డు చర్మం అవసరముంటాది. నెత్తిన మూరడెత్తు ఎలుగ్గొడ్డు చర్మముతో కుట్టిన టోపి యేసుకుని, ఢమరుకం వాయిస్తా మల్లన్న సామి కథ చెబుతారు కదా!'' ఉత్సాహంగా అన్నాడు ఎలుగ్గొడ్డోడు.

''అవును. ఈ పక్క కురమ కులస్తుల్లో కొందరు పిల్లకాయలు గురవ దీక్ష తీసుకుంటారు. ఆ గురవ దీక్ష తీసుకున్నోడు మల్లయ్యదారి కుక్క'' చెప్పాడు గురువయ్య.

''తమాషాగా వుండాదే. అదేమి దీక్షన్నా?''

''ఏం లేదబ్బా. హరిజన కులంలో ఊరిమేలు కోసం మాతమ్మ దేవత పేరుతో ఆడపిలకాయల్ని ముద్దరేసి బసివిగా మారుస్తారు గందా!''

''అవునన్నా. అట్ల బసివిగా మార్చిన ఆ బిడ్డ ఊరికంతా వదినైపోయి బిచ్చమెత్తుకోని బతకాల్సిందే'' తుంట బీడీని చివరి దమ్ములాగి విసిరిపడేస్తూ అన్నాడు ఎలుగ్గొడ్డోడు. ఎలుగ్గొడ్డు పైకి లేచి తన పంజాగోళ్ళతో నేలను గీకుతూ అక్కడక్కడే తిరుగుతోంది. దాన్నే చూస్తూ చెప్పాడు గురువయ్య,

''ఆ మాదిరిగానే శ్రీశైలంలో వుండే శివయ్య పేరు మీద పెండ్లిగాని మొగోనికి శివదీక్ష ఇచ్చి గురువయ్యను చేస్తారు. జంగమదేవరలేసుకునే నల్ల గౌను తొడిగించి, నడుముకు గవ్వల పట్టి యేసి, నెత్తిన ఎలుగుబంటి శర్మముతో కుట్టిన మూరెడె



త్తుండే టోపీ పెట్టి, సంకకు జోలె తగిలిస్తారు. బిచ్చమెత్తుకునే దానికి గోనె చేతికిచ్చి వదిలేస్తారు. ఇంక అప్పట్నుంచి దీక్ష తీసుకున్నాడు శివదాసరి. శివయ్య మాదిరే బిచ్చమెత్తుకుని బతకాల్సిందే'' వివరించాడు గురువయ్య.

''భలే ఆచారమన్నా మీది. అయితే ఈ మల్లేశు కుక్కలందరూ శ్రీశైలం పోయి దీక్ష తీసుకున్నోళ్ళేనా ఏందీ?'' తిరిగి ప్రశ్నించాడు ఎలుగ్గొడ్డోడు.

''ఆ పక్కోళ్ళు అట్లబోతారు. కానీ మా పక్కోళ్ళంతా తంబళ్ళపల్లె వుండే మల్లన్న కొండన దీక్ష తీసుకుంటారు. ప్రతి శివరాత్రికి యాడున్నె మల్లయ్య దారికుక్కలు ఆడికిచేరిపోయి గొరవాటాడతారులే'' అన్నాడు గురువయ్య.

''గొరవాటంటే ఏందన్నా?'' ఆసక్తిగా అడిగాడు ఎలుగ్గొడ్డోడు.

వంటిపైనున్న ఎల్ఎంపీ బనీను ఒక్కసారి సర్దుకుని, ''ఒక కంచు తట్టలో పాలు పోసి, మల్లయ్య దారి కుక్కలు పిల్లం గట్లు వాయిస్తా, ఢమఢమని వొగ్గు వాయిస్తా, కుక్కల మాదిరి కొట్లాడకుంటా ఆ పాలు తాగేస్తారు. ఇదే మల్లేశు కుక్కలాట'' చెప్పాడు గురువయ్య.

''అవునన్నా! తంబళ్ళపల్లె మల్లన్న కొండ ఒక శివరాత్రి దినాన ఆ ఆట చూసినా''

''శివరాత్రి రోజు యాడుండే మల్లయ్య దారి కుక్కలూ ఆ కొండకు చేరుకుని, ఏటవాలుగా వుండే ఆ బండమీద వాగసాట బిందెడు పాలు దిమ్మరిస్తారు. మల్లయ్య దారి కుక్కలు మల్లన్న కథపాడతా, ఆడతా ఆ పాలన్నీ నాకేస్తారు. ఆ వేడుక సూడిల్సాందే గానీ సెప్పనలివిగాదు''

''అబ్బ! నువ్వు సెప్తా వుంటేనే ఎట్లనో వుండా దాన్న. కండ్లార జూస్తే ఇంకెంత బాగుంటుందో'' ఆనందంగా అన్నాడు ఎలుగొడ్డోడు.

ఒక చిరునవ్వు నవ్వి''ఆ మల్లయ్యదారి కుక్కలకు ఆటాపాటా నేర్పించే గురువయ్యను నేను. నా టోపీని ఎలుకలు కొట్టేసినయి. తుక్కు తుక్కు అయిపోయిందది. ఎట్లోవొగట్ల కొత్త టోపీ కుట్టించుకుని శివరాత్రినాటికి ఏసుకోవాల. శివరాత్రికి ఇంకో వారమే'' అన్నాడు గురువయ్య.

''అదీ నిజమేలే. ఎలుగ్గొడ్డు టోపి లేకుంటే గురువయ్యవెట్టనిపించుకుంటావు?''

''యాడేడనో అడగతా వస్తావుండా. యాడా ఎలుగ్గొడ్డు చర్మమే దొరకలా. కడకు మీ పావుడీ సెప్తే ఇట్టొస్తావుండా'' చెప్పాడు గురువయ్య.

''నేనూ, ఆ ముడ్డిగుంటోడూ పలస్తరం వచ్చి అయిదారు నెలలైపోయింది. మా గేరిలో ఎవురి దగ్గిరన్నా దొరుకుతుందేమో సూడాలి'' అన్నాడు ఎలుగ్గొడ్డోడు.

వాళ్ళు అలా మాట్లాడకుంటుండగానే తన ఆటాపాటా ముగించుకుని, సంచీ చేత బట్టుకుని అక్కడికొచ్చాడు ముడ్డిగుంటోడు.

''ఏమిరో! ఎంతమాత్రం వరుంబడి?'' కళ్ళెగరేస్తూ అడిగాడు ఎలుగొడ్డోడు. ''పొద్దట్నుంచీ వళ్ళు అలిసిపోయేటినా ఎగిరిసస్తే పదిరూపాయలు దొరకలా. ఏం చేసేది?'' అంటూ సంచీ నేలపైన పెట్టి, మెడకున్న డిక్కీని, కాళ్ళకున్న గజ్జెల్ని తీసి అందులో ఒక పక్కకు తురికాడు. మరో పక్కనుంచీ ఓ పాత గాడా బనీను ఒకటి తీసి తొడుక్కుని'' ఈ యప్ప ఎవురు?'' అంటూ ప్రశ్నించాడు.

''ఆయప్పది మదనపల్లె దగ్గిర పెద్ద తిప్ప సముద్రం వుండ్లా, ఆడవొగవారు''

''ఏమి నీతో మాట్లాడతావుండాడే'' అని అడిగాడు.

''ఆయప్ప మల్లేశు కుక్కంట. ఎలుగ్గొడ్డు చర్మం కావాలని వచ్చినాడు'' చెప్పాడు ఎలుగొడ్డోడు.

''సరే! పోదాంపదా. ఇప్పుడు యెలబారితే గానీ ఎల్తురుండగానే గేరికి చేరుకోలేము''సంచీనెత్తి భుజానికి తగిలించుకుని అడవిమార్గం పట్టాడు ముడ్డిగుంటోడు.

ఎప్పుడెప్పుడు గేరికి చేరుకుందామా అన్న ఆతృత ఒక్క అతని ముఖంలో మెరిసి మాయమైపోయింది.

''జాంబా! ఉట్. ఆవ్‌రే.. ఆవ్'' అంటూ ఎలుగ్గొడ్డుని లేపి, అదిలించి దాన్ని నడిపించుకుంటూ ముడ్డిగుంటోన్ని అనుసరించాడు ఎలుగ్గొడ్డోడు. గురువయ్య వాళ్ళ వెంట నడవసాగాడు. కొంతసేపటికి వాళ్ళు అడవిలోకొచ్చేశారు. ధనుము దీసిన బండ దాటుకుని ఎలుగ్గొడ్డోని బాయివైపు నడవసాగారు. అడవిలో రకరకాల పక్షుల అరుపులు వినిపిస్తున్నాయి. ఆ అడవిలో దారిపక్కల ఉల్లింజ చెట్లు, బీర చెట్లు, చిగర చెట్లు, సీతాఫలం చెట్లు, పెద్ద జముడు పొదలు, బలస కంపలు, తుమ్మ చెట్లు ఇంకా ఏవేవో పేర్లు తెలియని తీగలు, చెట్లు కనిపిస్తుంటే ఆశ్చర్యంగా చూస్తూ వాళ్ళ వెంట నడుస్తున్నాడు గురువయ్య.

ఆరు నెలల తర్వాత మళ్ళీ ఇన్ని రోజులకు ఆ అడవిని చూస్తున్నందుకు, గేరికి చేరుకుని తమ వాళ్ళని చూడబోతున్నందుకు ఆనందంగా అంగలు వేస్తూ నడుస్తున్నారు ఎలుగొడ్డోడు, ముడ్డిగంటోడు.

''మీ గేరి గురించి వినడమేగానీ ఎప్పుడు చూడలా. ఇంకా ఎంతదూరమబ్బా మీ గేరి'' అడిగాడు గురువయ్య.

''వచ్చేసినాంలేన్నా.. ఇంకెంత సేపు. వొగ వక్క కొరికినంత సేపు రెండు గాడావులు అట్ల నడిస్తే చాలు గేర్లోపడిపోతాం'' అన్నాడు ఎలుగ్గొడ్డోడు.

ఇంతలో సముద్రం పైన పయనించే పడవలా, ఆ డొంక దారిలో అలా ఇలా ఊగిపోతూ టుకుటుకుమని శబ్దంచేసుకుంటూ ఎదురుగా వచ్చింది ఒక ట్రాక్టరు.

ఆ అడవిలోనుంచీ ఎప్పుడూ ఎలాంటి వాహనమూ రావడం చూసి ఎరుగని ఎలుగ్గొడ్డోడు ఆశ్చర్యంగా దాన్నే చూడసాగాడు. అది సమీపించగానే ముగ్గురూ దానికి దారి వదిలారు. అది వెళ్ళినప్పుడు రేగిన దుమ్ము ఒక్క క్షణం వాళ్ళని పొగలా కమ్మేసింది. ఆ దుమ్మునుంచి తేరుకుని కళ్ళు తెరిచిన వాళ్ళకు, నడవడానికే కష్టంగా వున్న ఆ డొంక దారి వాహనాలు వస్తూపోతూ కాబోలో మట్టి రోడ్డులా కనిపించింది. ఆ విషయాన్ని వాళ్ళు అంత వరకూ గమనించినట్టులేదు.

'' ఏరా ముడ్డిగంటోడా! మన గేరికి రోడ్డుపడినట్టుండాది. ఈ దారింట మనుషులు రాకపోకలు జాస్తీ అయితే మనకు ఆపితే'' ఆశ్చర్యపోతూ అన్నాడు ఎలుగ్గొడ్డోడు.

''ఇట్ల అర్నెళ్ళకోసారి పలస్తరాలు పోయి వస్తా, అడవుల మీద బడి బతికే మనకు ఏం జరిగితే మాత్రం పోయేదేముండాది, వచ్చేదేముండాది గానీ రాబ్బా'' అంటూ ఇంకా వేగంగా నడవసాగాడు ముడ్డిగంటోడు.

వాళ్ళ మధ్య కొంతసేపు మౌనం కరడు గట్టింది. దాన్ని భంగపరుస్తూ ''నేనో మాట అడుగుతా సెప్పయ్యా'' అన్నాడు గురువయ్య.

''ఏమ్మాటనా!'' అడిగాడు ఎలుగ్గొడ్డోడు.

''అసలు నీ పేరేందప్పా''

''అయ్యో పేరడిగితివా. మా గేర్లో శానా మందికి పేర్లుండవన్నా. ఎవురు ఏ పనిచేస్తే వాడికదే పేరు. అద్దో ముందు బోతా వుండ్లా వాడు ముడ్డికి గంట కట్టుకునిన ఆడగాడు గాబట్టి వాడి పేరు ముడ్డిగంటోడు. ఆ ఆట వాడు భలే ఆడుతా



డులే'' చెప్పాడు ఎలుగ్గొడ్డోడు.

''ఇంతకు ముందే పల్లెలో సూసినాన్లే''

''ఆ ఆట వాడికి వాళ్ళ తాతముత్తాత కాలం నుంచి వచ్చింది. వీడి వంశంలో ఈ ఆట తెలిసనోడు వీడొక్కడే.. వాడుపోతే వాడితో పాటు ఆ ఆటాపాటా కూడా అంతే''

''అది సరే. నీ పేరు చెప్పమంటే వాడిపేరు సెప్తవేంది''నిష్ఠూరంగా అన్నాడు గురువయ్య.

''వాడెప్పుడూ అంతేలే. విడ్డూరం మనిషి. అడిగింది సెప్పడు. నేను సెప్తాలే. వాడి పేరు ఎలుగ్గొడ్డోడు'' అంత వరకూ మౌనంగా నడుస్తున్న ముడ్డిగంటోడన్నాడు.

మళ్ళీ వాళ్ళ మధ్య కొంతసేపు మౌనం కొనసాగింది. నడుస్తున్న ఎలుగ్గొడ్డును చూసి కృష్ణపక్షి ఆకాశంలో వాళ్ళపైగా ఎగురుతూ కీచుకీచుమని అరుస్తూ రొద పెట్టసాగింది.

''సరే! అసలు ఈ ఎలుగుబంటు నీకెట్లా సిక్కింది, ఎట్ల మచ్చికయింది. అది సెప్పప్పా'' మళ్ళీ తనే మౌనాన్ని ఛేదిస్తూ అడిగాడు గురువయ్య.

''ఇది నాకు సిక్కింది గాదన్నా. మా పూర్వీకుల నుంచీ వస్తావుండే వృత్తి వీటిని మేపడమే'' అన్నాడు ఎలుగ్గొడ్డోడు.

''మీ పూర్వీకుల నుంచా! అదెట్లో కొంచెం సెప్పప్పా ఇంటా'' అన్నాడు గురువయ్య. అడవి చెట్ల మీదుగా వస్తున్న చల్లటిగాలిని గుండెల నిండా ఒక్కసారి పీల్చి ఉపశమనం పొందుతూ చెప్పసాగాడు ఎలుగొడ్డోడు.

''అప్పుడెప్పుడో మా తాత ఒకాయనున్నాడంట. ఆయప్ప ముసల్మాను. దూదేకుల సాయిబు. ఆయప్ప సింతపండెత్తుకుని సుట్టుపక్కల సంతలకు పోయి అంగిడేసి అమ్ముకుంటున్నాడంట. ఆయనతో పాటు ఒక నక్కలోళ్ళామె పిన్నీసులు, సూదులు, దబ్బనాలు, సబ్బుల పెట్టెలు, అద్దాలు వంటివి. సిన్న సిన్న సామన్లతో ఆయప్ప పక్కనే అంగిడేసుకుని అమ్ముకుంటూ వున్నదంట. ఇట్ట రాను రాను వాళ్ళిద్దరికీ మనసు మనసు కలిసిపోయి, మాటా మంతీ కుదిరి పెండ్లి చేసుకున్నారంట. కొన్ని దినాలకు యాపారంతో సంసారం జరక్క, ఆయమ్మ ఆయప్పను తీసుకుని ఆయమ్మవాళ్ళుండే గేరికి తీసుకొచ్చి కాపురం పెట్టిందంట. నక్కలోళ్ళు అడవిలో యాడ నీళ్ళుంటే ఆడ గుడారాలేసుకుని, సుట్టుపక్కలుండే నక్కల్ని, కుందేళ్ళని పట్టి తిని బతికేవాళ్ళు గదా. వాళ్ళ గేరి వుండేది ఎలుగ్గొడ్డోని బాయిగాడనుండ్లా బండ, ఆ బండపైనే గదా. పేరుకు అది గేరే గానీ పట్టుమనిన పదిండ్లు లేవు. ఒకసారి గేరిజనం అడవిలో ఆ పక్కనుండే చింతలొంకలో కొచ్చి నీళ్ళు తాగేసి పోయేవంట. మాయవ్వ నిండు గర్భిణీఅంట. అందుకనీ, ముసిలోళ్ళతో బాటు ఎలుగ్గొడ్డోని బాయి దగ్గిరుండే గుడిసెల్లోనే ఉండిపోయి వున్నదంట.

సింతలొంకలో ఒకదినం మా తాత అడివంతా తిరిగి అలిసిపోయి గుడారానికొచ్చి ఒళ్ళు తెలీకుండా నిద్రబోతున్నాడంట. ముందే ఇప్ప సారాయి తాగున్నాడో ఏమో, వళ్ళు సోకరమే లేకుండా వుండిందంట. అర్ధరాత్రి కాడ సరిగ్గా ఆకాశంలో గోరుకొయ్యలు నడినెత్తి కొచ్చినాయంట. అప్పుడూ ఎలుగొడ్డొకటి డేరాలో దూరిపోయి ఆయప్ప పక్కన పెండ్లా మాదిరిపండుకుని వుండిపోయిందంట. ముందే సలికాలం. పైగా పెండ్లానికి దూరం. ఇంకేముండాది. ఆ నిద్దట్లోఅదే పెండ్లాం అనుకునొ అబ్బిళించి పట్టుకుని యెచ్చంగా వుండిపోయినాడంట. తెల్లారినాక మెలకువొచ్చి, చూసి బిత్తరపోయి 'సచినాన్రా దేవుడా' అంటూ అర్చేసినాడంట. దాంతో గుడారాల్లో జనమంతా వచ్చేసి, దాన్నెట్లో గట్ల పట్టేసి కట్టేసినారంట. అది నిండూ సూటిదంట. ఎవరో యాటగాడు తుపాకీతో కాలిస్తే, గుండు జబ్బకు తగిలి తప్పించుకుని దిక్కుతెలీక వచ్చి డేరాలో దూరిందంట. మా తాత దానిబాధ చూడలేక దాని మెడకొక ఇనుప గొలుసు కట్టి, దాని గాయం మానిపించినాడంట. అది అక్కడే రెండు పిల్లల్ని ఈనిందంట. మా తాత అన్ని రోజులూ దానికి కలబంద గడ్డలు తిని మేపినాడంట.అప్పుడప్పుడూ పుట్ట తేనేలు గూడా తెచ్చిపెట్టాడంట. దాంతో అది, దాని పిల్లలు ఆయప్పకు అయిపోయినాయంట. ఈయప్ప వాటికి ఆట పాటా నేర్పించి పల్లెలెంట వాటిని తిప్పుతా సంసారమీదినాడంట. ఇంగ అప్పట్నుంచి ఆయప్పకూ ఆయన సంతుకూ అదే వృత్తి అయిపోయిందంట. అట్ల మా తాతల కాలం నుంచీ వీటిని మేపేది మాకు కులవృత్తిగా మారిపోయిందన్నా'' తన వెంట నడుస్తున్న ఎలుగ్గొడ్డును మురిపెంగా చూస్తూ ముగించాడు ఎలుగ్గొడ్డోడు.

ఆ కథంతా విని, ''మీరుండే గేరికీ ఎలుగ్గొడ్డు బండ అనీ, ఆ బాయికి ఎలుగ్గొ డ్డోని బాయి అనీ మీ తాతను బట్టే పేరొచ్చిందనుకుంటా?'' అడిగాడు గురువయ్య.

''అవునన్నా! మా అడవిలో నేలను సదును చేసి, ఆ ఏట్లో వుండే బాయినీళ్ళతో సేద్యం గూడా చేసినాడంటలే. అప్పట్నుంచి ఈ చుట్టుపక్కల పల్లెల్లో వుండే రైతులు కట్టెక కోసం అడవికొస్తాపోతా, ఆ బాయికి ఎలుగ్గొడ్డోని బాయనీ, ఆ బండకు ఎలుగ్గొడ్డోని బండనీ పేరు పెట్టారంట. మా నాయన ఇదంతా సెప్పేవోడులే'' వివరించాడు ఎలుగ్గొడ్డోడు.

''మంచి విద్యే మీది. ఆడయాగనో అడవిలో జీవించే ఎలుగ్గొడ్డుని మేపి, ఆడించే విద్య ఏమి సామాన్యమా!'' అన్నాడు గురువయ్య.

''నిజమే. కానీ, ఈ విద్దె నాతోనే కడ అయిపోయేటిగా వుండాదే'' బాధగా అన్నాడు ఎలుగ్గొడ్డోడు.

'' ఏమట్టంటివే?'' అన్నాడు గురువయ్య.

''ఏం చేసేదన్నా! ఇంతదాకా ఎట్లోగట్లా ఎలుగొడ్లు మేపుకుంటూ వచ్చినారు మావోళ్ళు. ఇప్పుడు దీనికీ పిల్లల్లే. అందునా నా బిడ్డలు దీన్ని మేపడానికి ఇష్టపడ్డంలే. ఈ వృత్తి, దీని ఆటాపాటా నాతోనే ఆఖరైపోయేట్టుగా వుందన్నా'' యాష్టపోతూ చెప్పాడు ఎలుగ్గొడ్డోడు.

''అయినా జనాలకు నాగరీకం ముదిరిపోయింది. మా ఆటలకు, పాటలకు మనసు సూపించడంలే. అందరికీ సిన్మాలు, టీవీలు ఎక్కువైపోనాయి. మా ఆటాపాటా ఎత్తుకుని ఇండ్ల ముందరికి పోతే దయదల్చి చెయ్యి చాపి, అంత పెట్టేవాళ్ళే కరువైపోయుండారు. ఇంక మాయట్టావోళ్ళు యెట్ట బతకాలో ఏమో పో'' అంతవరకూ నిశ్శబ్దంగా అదంతా వింటూ నడుస్తున్న ముడ్డి గంటోడు అన్నాడు.

అలా పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఎలుగ్గొడ్డోని బాయి సమీపానికి వచ్చారు. అక్కడే దారి పక్కన జడలు విరబోసుకుని నిలబడ్డ పిశాచంలా గుబురుగా కనిపిస్తోందొక చింతచెట్టు. అప్పటికే ఆ చెట్టు కింద బాగా దుమ్ము కొట్టుకుపోయిన శరీరాలతో అయిదారుగురు నిలబడివున్నారు. ఆచెట్టుకవతల..కొత్తగా కనిపిస్తున్న మట్టిరోడ్డు పైన మరో ట్రాక్టర్ దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది. ఆ ట్రాక్టరును ఆశ్చర్యంగా చూసుకుంటూనే, మెల్లగా నడుచుకుంటూ ఆ చెట్టుకిందికి చేరుకున్నారు. అక్కడికి కూత వేటు దూరంలోనే వాళ్ళ గేరి. అక్కడి నుంచీ చూస్తే వాళ్ళ గేరి కనిపించేది. కానీ ఆ వేళ వాళ్ళకు గేరి కనిపించలేదు.

''అయ్యో! మా గుడిసెలేమయ్యాయి? మావోళ్ళు ఏమైనారో?'' అంటూ ఆందోళనకు గురయ్యారు. గుడిసెల స్థానంలోని బండసగం ఏదో మాయ జరిగినట్టు కనిపించకుండా పోయింది. ఆ విషయం వాళ్ళ గుండెల్ని భయంతో ఊపేసింది. బేంబేలు పడిపోతూ ఆ బండ వైపే చూస్తుండిపోయారు.

ఆ బండకానుకుని ఒక వింత రాక్షసి ఏదో మత్తుగా పడుకొనివున్నట్టు ఒక పొడువాటి యంత్రం, దాని చుట్టూ నుగ్గునుగ్గై పడిపోయి వున్న గుల్ల, దుమ్ము.. ఆ దృశ్యం చూస్తుంటే ఏ మాయమృగమో వేటాడి మాంసం తినేసి వదిలిపెట్టిన జంతు కళేబరంలా అనిపిస్తోంది బండ.

''ఏందయ్యా సామీ అదీ?'' ఇంక ఆపుకోలేక పక్కనున్న వ్యక్తిని అడిగాడు ఎలుగ్గొడ్డోడు.

శరీరమంతా దుమ్ము కొట్టుకుని కనిపిస్తున్న ఆ వ్యక్తి'' అది స్టోను క్రషరయ్యా'' అన్నాడు.

''స్టోను క్రషరా?'' అయోమయంగా ముఖం పెట్టాడు ముడ్డిగంటోడు.

''అవునయ్యా, ఈ బండను క్రష్షింగ్ చేసి కంకర రాళ్ళు తయారుచేస్తారు. అదే ఆ మిషన్'' అన్నాడు మరో దుమ్ము మనిషి.

'' వాటితో ఏంచేస్తారు?'' అమాయకంగా అడిగాడు ఎలుగొడ్డోడు.

''టవున్లో ఇండ్లు కట్టేదానికీ, రోడ్లు ఏసే దానికి రాళ్ళు అవసరం కదా'' అన్నాడు మరో వ్యక్తి.

''మిద్దెలకు మేడలకు, తారురోడ్లకు, రైలు పట్టాలకు, కంకర వాడకం ఎక్కువ గదా'' అన్నాడు మొదట పలకరించిన వ్యక్తి.

''దానికి టాన్లో భలే డిమాండ్. ఈ బండకు గాట్లు పెట్టి, కొట్టి ఆ మిషన్తో గులకరాళ్ళు తయారుచేసి లారీలకు, ట్రాక్టర్లకు ఎక్కించి, అట్ల తిరుపతి, చిత్తూరుకు, ఇటు మదనపల్లి, బెంగుళూరుకు తోల్తారు. ఇదంతా కోట్ల యాపారమంట. ఆ

మిషన్ పెట్టినోడు దుడ్లు వారు కుంటావుండాడు''

''మరి ఆ క్రషర్ను పెట్టిందెవ్వరు?'' అడిగాడు ఎలుగ్గొడ్డోడు.

''ఆయప్ప పెద్ద కోటీశ్వరుడులే. గవర్నమెంటు దగ్గిర లైసెన్సు తీసుకుని ఈ బండను చీల్చుతా వుండాడు''

''మేము అందులో కూలీలం''

''కూలీ కూడా బాగానే గిట్టుబాటుగా ఉంది'' ఒకరి తర్వాత వకరుగా చెప్పారు.

వాళ్ళ మాటలు విన్న తర్వాత, అడవిలోంచి మట్టిరోడ్డు ఎందుకు ఏర్పడిందో, ఆ రోడ్లో ట్రాక్టర్లు ఎందుకు తిరుగుతున్నాయో ముడ్డిగంటోనికీ, ఎలుగొడ్డోనికి పూర్తిగా అర్థంకాసాగింది. వాళ్ళు అలా మాట్లాడుకుంటుండగానే ఎలుగ్గొడ్డు, చైన్ లాక్కుని బండ వైపు పరుగెత్తింది.

''దీనికి బండ మీదున్న గేరి మర్లుపోలా. అందుకే పరుగెత్తుతా వుంది. అనుకుని, ''జాంబా.. వుండు.. నేనూ వస్తా వుండా..తేరో..'' అంటూ అరుస్తూ దాని వెంట పరుగెత్తాడు. ''య్యోవ్. నీపాసుల గోల. పోవద్దు పోవద్దు''అంటూ బిగ్గరగా అరవసాగారు చెట్టు కింద కూలీలు.

వాళ్ళు ఎందుకరుస్తున్నారో అర్థం కాని ముడ్డి గంటోడూ ''ఉండవయ్యా నేనూ వస్తా వుండా'' అంటూ ఎలుగొడ్డోని వెంటపడ్డాడు.

''ఏమయ్య వద్దు, పోవద్దు'' అంటూ అరుస్తూనే వున్నారు కూలీలు. ముందు ఎలుగుబంటు, దాని వెనక ఎలుగ్గొడ్డోడు, వాడి వెంట ముడ్డిగంటోడు పరుగెత్తి, క్షణంలో క్రిషంగ్ కోసం తవ్వేసిన క్రషింగ్ కోసం తవ్విన బండ తగ్గులోకి దిగి కనిపించకుండా పోయారు.

పడమటి కొండలపైన సూర్యుడు, ఎర్రగా మండిపోతున్నాడు. చెట్టు కింద వున్న కూలీలు అయ్యాయ్యో అంటూ అరుస్తూనే వున్నారు. అందరూ చూస్తుండగానే ఒక్కసారిగా దిక్కులు పిక్కటిల్లేటట్లు, చెవులు చిల్లులు పడేటట్లు, మిన్ను విరిగి హఠాత్తుగా పైన పడ్డట్టు 'ఢాం' అన్న శబ్దం.

నాట్లు పేలిన శబ్దం!

అది అడవంతా ప్రతిధ్వనించి, వానాకాలపు మేఘాల్లో ఉరుములా..కొండల కోనల్లో అంచలంచెలుగా వినిపించి అంతమైపోయింది. ఆ శబ్దానికి అడవిలోని పక్షులు కీసర బాసరమంటూ ఆకాశంలోకి ఎగిరిగోల చేశాయి.

ఆ శబ్దం విన్న చెట్టు కింద కూలీలు చెవులు మూసుకున్నారు. పేలిన ఆ శబ్దంతోపాటు తునాతునకలైన బండరాళ్ళు ఆకాశానికెగిశాయి, ఆ రాళ్ళు కూలీలు నిలబడివున్న చోటుకు కొంత దూరం వరకూ వచ్చిపడ్డాయి. దాంతో కూలీల గుండెలు గుభేలుమన్నాయి.

క్షణం తర్వాత ఏమీ జరగనట్లే మళ్ళీ నిశ్శబ్దం!

ముండకొడుకులు అరస్తావుంటే వినిపించుకోలే. పరుగెత్తిపోయిరి''

''ఏమైనారో, ఏమోరా నాయనో, పరుగెత్తండి''

కేకలు వేసుకుంటూ చెట్టుకింద నుంచీ బండవైపుకు పరుగెత్తారు కూలీలు. బండకు అవతల నుంచీ కూడా నాట్లు పెట్టిన వాళ్ళూ, మరికొందరు మనుషులు పరుగెత్తుకుంటూ వచ్చారు. అందరితో పాటూ గురవయ్య అక్కడికి వెళ్ళాడు.

అక్కడ..నాట్లు పెట్టినంత దూరం. తెల్లటి బండ చీలిపోయి, పేలుళ్ళకు ముక్కలై, కుప్పబడి కనిపిస్తున్న బండరాళ్ళు, ఆ రాళ్ళపైన గుర్తుపట్టలేనంతగా ముక్కచెక్కలై పడివున్న అవయవాలు.. రక్తపు మరకలు..చూడలేకపోయారు జనం.

బండకానుకుని వున్నెలుగ్గొడ్డోని బావిలోకి తొంగిచూశారు కొందరు. వాళ్ళతో పాటు గురువయ్య కూడా బావిలోకి చూశాడు.

నాట్ల దెబ్బకు చిందరవందరగా చిట్లిపోయిన తలతో, శరీరంతోడుతూ.. నీళ్ళల్లో తేలుతూ కనిపించాడు ఎలుగొడ్డోడు. అతని శరీరం నుంచీ కారిన రక్తంతో బావి నీళ్ళు, ఆ నీళ్ళతో బాటు వంకలో సాగిపోతున్న నీళ్ళు రక్తసిక్తమైపోయి ఎర్రగా కనిపిస్తున్నాయి. ముడ్డి గంటోడు, ఎలుగొడ్డు శరీరాలు అవయవాలు సైతం గుర్తుపట్టలేని విధంగా తునాతునకలై పోయాయి.

ఆ దృశ్యం చూసిన గురువయ్య మనసు కకావికలమైంది.

క్షణం ముందు దాకా నాతో వున్న వాళ్ళు, కలిసి అడవికి నడిచినోళ్ళు.. ఇప్పుడు! గుర్తు తెలీకుండా, పులుసులోకి ఎముకలు కూడా దొరకనంతగా అయిపోయినారు. ఎవరు మాత్రం శాశ్వతం. ఇప్పుడున్నోడు ఇంకొక గడియకు లే. ఈ గెడియలో మన్నోడు రేపులే. రేపున్నోడు మరునాటికి లేడు''నొప్పిగా మనసులోనే అనుకోసాగాడు గురువయ్య.

''అయ్యో, చెప్పేలోపల వచ్చేసినారా సామి''

''దాని ముండమోయ, ఆ ఎలుగ్గొడ్డు పరుగెత్తుకుంటూ నాట్లు పెట్టిన తావుకే ఎందుకు రావాల ? దాని కోసం ఆ ఇద్దరూ ఈడికెందుకు రావాల? వచ్చి ఈ మాదిరిగా ఇక్కడ కడతేరి పోయిరే''

''అంతా మాయగా వుండాది.కండ్లు మూసి తెరిసే లోపల జరిగిపాయ'' ఎవరికీ తోచిన విధంగా వాళ్ళనుకుంటున్నారు.

కొందరు నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు. అందరు గుండెలు బాదుకుంటున్నారు. ''వొరే. ఆ కాంట్రాక్టరు, మేస్త్రీగాడు టౌనుకి బాయినారు. ఇంకా రాలే. మనం ఇంకా ఇక్కడే వుంటే..పోలీసోళ్ళు మనల్ను పట్టుకపోతారు. ఈ కూలీ సరే. ఆ పనీ సరే పోదాం పదండ్రా సామీ'' ఆ గుంపులో నుంచి ఎవరో కేకేశారు.

''ఎక్కడి నుంచి వచ్చినావో ఏమో. ఊరికే తగులుకుంటావు.నువ్వా పో'' గురువయ్యను హెచ్చరించారు. బరువెక్కిన గుండెతో అక్కడి నుంచీ వెనుదిరిగాడు గురువయ్య.

''అయిపాయే. అంతా అయిపాయే. ఎలుగొడ్డు చర్మము కోసం వస్తే ఎలుగ్గొడ్డే లేకుండా పాయే. ఏమీ ఖర్మో. యాడనించో వచ్చి ఈడ ఈ ఘోరం సూడాల్సివచ్చే'' మౌనంగా రోదిస్తూ, అంతకు ముందు నిలబడ్డ చింతచెట్టు కాడికొచ్చాడు.

అతని మనసు మరోసారి బాధగా మూలిగింది. చివరిసారిగా బండవైపు చూశాడు.

బండ.. నాట్ల దెబ్బకు చచ్చిపోయినవారి దేహాల్లాగే చిందరవందరగా కనిపించింది.

''బండపైనున్న వాళ్ళగేరి ఏమైందో, పాపం వాళ్ళు వోళ్ళను కలుసుకోకుండానే పోయిరి'' తన్నుకొస్తున్న దుఃఖంవల్లా కారుతున్న కన్నీటితో నిట్టూర్పు విడిచాడు. ఆ బండ పక్కనున్న క్రషర్.. సముద్రంలో పెద్ద పెద్ద జలచరాలను మింగేసి ఏమీ ఎరగనట్లు నింపాదిగా నిద్రపోతున్న తిమింగలంలా అనిపించింది.

''ఏందో. నాట్ల దెబ్బకు ఆ ఎలుగ్గొడ్డోడు, ముడ్డిగంటోడు బలైపోయిరి. ఆ ఎలుగ్గొడ్డు వాళ్ళ దారి పట్టే. వాళ్ళ ఆటాపాటా అన్నీ వాళ్ళతో బాటే పాయే. నాకు ఎలుగ్గొడ్డు చర్మము దొరికే రాత లేకుండా అయిపాయే. ఇంక నా మల్లేశు కుక్కలంటూపోయినట్టేనేమో? ఇప్పుడేం చేయాలా? ఎక్కడ పోవాల? అసలు ఇట్ల ఎందుకు జరగాల?''

తీవ్రంగా ఆలోచిస్తూ, మరిచిపోలేని ఆ సంఘటననే పదేపదే తలుచుకంటూ, వచ్చిన దారి వెంటనే తిరిగి వేగంగా నడక ప్రారంభించాడు గురువయ్య.

★

## రచయిత పరిచయం



పుట్టింది చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కురవపల్లె గ్రామంలో. తిరుపతి లోని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో బి.ఎ, ఎస్వీ యూనివర్శిటీలో ఎం.ఏ చేశాను. చిత్తూరు జిల్లాలోని వేడుకల పాటలపై ఎం.ఫిల్, రాయలసీమ వేడుక పాటలపై పి.హెచ్‌డి. వందకు పైగా కథలు, కవితలు, గేయాలు, వ్యాసాలు రాశాను. పలు నవలలు, నాటికలు, నాటకాలు, కథా సంపుటిలు వెలువరించాను. టీవీ, రేడియో ప్రసంగాలు చేశాను. నా రచనలు కన్నడ, హిందీ, తమిళ, ఆంగ్ల భాషల్లోకి అనువాదం అయ్యాయి. 100కు పైగా నాటకాల్లో నటించిన అనుభవం వుంది. రాష్ట్ర అధికార భాషా పురస్కారం, విమలాశాంతి పురస్కారం, కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారం, విపుల. చతురల నవలల పోటీల్లో బహుమతులతో పాటూ తానా వారి బహుమతులు ఎన్నో అందుకున్నాను. సి.పి.బ్రౌన్-నవ్య వీక్లీ కథల పోటీలో నా కథను బహుమతికి ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు.

-డా.వి.ఆర్.రాసాని